
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

గురువారం 8 ఆగస్టు 2024



గిరిజన సంస్కృతికి ప్రతీక

తీజ్ వేడుక

- తొమ్మిది రోజులపాటు సందడి
- ఆచార వ్యవహారాలే ప్రాణంగా..
- జిల్లాలో మొదలైన తీజ్ ఉత్సవాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

గిరిజనుల సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక తీజ్ వేడుక. సీత్లా భవానీ, బోగ్ బండార్, తీజ్ ఉత్సవాలు గిరిజనుల సంస్కృంతీ సంప్రదాయాలకు అద్దం పడతాయి. ఇందులో భాగంగానే ప్రకృతిని ఆరాధిస్తూ గిరిజనులు ఏటా శ్రావణ మాసంలో తీజ్ ఉత్సవాలను జరుపుకుంటారు. నెల చివరి వరకు కొనసాగే సంబరాలు జిల్లాలో మొదలయ్యాయి. తీజ్ ఉత్సవాలు ఆరంభమవడంతో తండాల్లో సందడి నెలకొంది. ముఖ్యంగా వర్షాలు మొదలవడంతోనే లంబాడీలు శీత్లా, తీజ్ ఉత్సవాల్లో మునిగితేలుతారు. బతుకమ్మ పండగను పోలి తీజ్ ఉత్సవాలు కొనసాగడం ప్రత్యేకం.



బుట్టలనుసిద్ధం చేస్తున్న యువతులు (ఫైల్)

● బతుకమ్మ తరహాలో తీజ్ ఉత్సవం

తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ పండుగలాగే తీజ్ వేడుకలను జరుపుకుంటారు. తీజ్ అంటే పచ్చని పంట లేదా నారుగా అర్థం వస్తుంది. తీజ్ బంజారాల మాతృదేవత మేరామాకు ప్రతిరూపంగా విశ్వసిస్తారు. బంజారాల సంస్కృతిలో ఏడుగురు మాతృదేవతలు ఉంటారు. వారిలో మేరా పెద్దది. ఆమె పైరు పంటలను రక్షిస్తుందని వర్షాలు కురిసి వేసిన పంటలు పుష్కలంగా పండి ధాన్యం ఇంటికి వస్తుందని భావిస్తారు. పచ్చని నారును మేరమా రూపంగా మలిచి పండుగగా జరుపుకుంటారు. తొలకరి చినుకులు కురిసిన తరువాత తండా ప్రజలు అదును చూసి విత్తనాలు వేస్తారు. పచ్చగా పెరుగుతున్న పంటను చూసి తండా ప్రజలు తీజ్ ఉత్సవాన్ని జరుపుతారు. పంట ఏపుగా పెరిగే నాటికి జూలై చివరి ఆగస్టు మాసం చివరి వరకు ఈ పండుగ నిర్వహించడం ఆనవాయితీ. బంజారాలు భూమిని పంటను దేవత రూపంగా భావిస్తారు. తండా పెద్ద అనుమతితో ముత్తైదువలు సూత్రదారులుగా బంజార యువతులతో పండుగ నిర్వహిస్తారు.

● నాలుగు దశల్లో పండుగ

తొమ్మిది రోజులు నాలుగు దశలుగా పండుగను నిర్వహిస్తారు. మొదటిది బుట్టల్లో గోధుమలను చల్లుతారు. దీన్ని తీజ్ బోరా యేరో అంటారు. రెండోది కడావో దేవతకు నైవేద్యం సమర్పించడం. మూడోది గణ్ గోర్ అంటే మేరామా సేవాలాల్‌ల పెళ్లి. నాలుగోది గోధుమ నారును చెరువులో వదులుతారు. వేరా యేరోగా పిలుస్తారు. బంజారా యువతులు గోధుమలు కొని సారవంతమైన మట్టిని తీసుకొచ్చి బావి దగ్గర నుంచి శుభ్రమైన నీటిని తెచ్చి పాటలు పాడుకుంటూ గోధుమలను నానబెడుతారు. పెద్దలు తీజ్ బుట్టలను తయారు చేసి ఇస్తారు. గోధుమలు నానబెట్టి బాటిని బుట్టల్లో వేసి అమ్మాయిలు నృత్యాలతో పాటలు పాడుతూ వెళ్తారు. యువతులు గోధుమలు నానబెట్టి బుట్టలు వేసే పనిలో ఉంటే వారి అన్నదమ్ములు మంచె వేస్తారు. కింద ఉంటే నారును పశువులు తింటాయని ఎత్తుగా ఈ మంచె తయారు చేస్తారు. పెద్ద బుట్టను ఒక దాన్ని ఏర్పాటు చేసి మిగిలినవి చిన్న బుట్టలను ఉంచుతారు. నారు ఏపుగా పెరగడానికి ఉదయం మధ్యాహ్నం సాయంత్రం క్రమం తప్పకుండా నీళ్లు పోస్తారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం నీళ్లు పోసే సమయంలో పాటలు పాడుతారు.

ఉప్పు కారం లేని ఆహారం

తీజ్ బుట్టల తయారీ నుంచి గోధుమ నారును చెరువులో వదిలే వరకు అమ్మాయిలు ఉప్పు, కారం లేని ఆహారాన్ని తీసుకుంటారు. బంజారాలు రోజంతా వ్యవసాయ పనులు ముగించుకొని సాయంత్రం వేల తీజ్ దగ్గరకు చేరి పాటలు పాడడం నృత్యాలు చేయడం ఆనవాయితీ. వారు పాడే పాటల్లో భక్తి పారవశ్యం కనిపిస్తుంది. 7వ రోజున సేవాలాల్‌కు శాఖహార నైవేద్యాన్ని సమర్పిస్తే మేరామా దేవత మాంసహార నైవేద్యాన్ని స్వీకరిస్తుంది. ప్రతీ కుటుంబం కొంచెం బియ్యం పిండిని దీక్షలో ఉన్న అమ్మాయిలకు పంపిస్తారు. పిండి బెల్లం కలిపి అమ్మాయిలు తీజ్ దగ్గరే నైవేద్యాన్ని తయారు చేస్తారు. దీన్ని బుజ్యా లాప్సీ అంటారు. ఈ పదార్థాన్ని నెయ్యితో కలిపి మంటలో వేస్తారు. బియ్యం పిండితో రొట్టె చేసి బెల్లంతో కలిపి ముద్ద చేస్తారు. దీన్ని చుర్మో అంటారు. మేరామా సేవాలాల్ పెళ్లి కూడా 9వ రోజు ఘనంగా నిర్వహిస్తారు. గణ్ అంటే భార్య గోర్ అంటే భర్త గణ్‌గోర్ ఉత్సవంగా జరుపుతారు. సాంప్రదాయంగా అలంకరించి పెళ్లి నిర్వహిస్తారు. దేవతలకు నైవేద్యం సమర్పించగానే మంచెమీద ఉన్న బుట్టలను అన్నదమ్ములు తీసుకొని పరుగెడతారు. వారి వెంట అక్కాచెల్లెల్లు, అన్నదమ్ములు పరుగు తీస్తారు. బుట్టలోని నారు ఏమీ చెయ్యవద్దని తమకు ఇవ్వాలని వేడుకునే కార్యక్రమం నిర్వహిస్తారు. దేవతకు ప్రతిరూపాలైన చిన్న బుట్టలను చిందర వందర చేస్తే శోక భరిత గీతాలను ఆలపిస్తారు. ఇలా అనేక విధాలుగా ఉత్సవాన్ని కొనసాగిస్తారు. తొమ్మిదో రోజున గోధుమ నారును చెరువులో వదులుతారు. చిన్న పీట మీద అన్నదమ్ములు అక్కాచెళ్లల్ల కాళ్లు కగిడి తమ ప్రేమానురాగాలను ప్రకటిస్తారు. అన్నదమ్ములు, అక్కాచెళ్లెళ్లకు అనుబంధంగా పాటలు పాడుకుంటారు. తీజ్ ఉత్సవంలో పాల్గొనే అమ్మాయిలకు మంచి భర్తలు వస్తారని మంచి కాపురం ఉంటుందని కూడా భావిస్తారు.

స్వచ్ఛదనం.. పచ్చదనంలో ప్రజలను భాగస్వాములను చేయాలి

● జిల్లా ప్రత్యేక అధికారి శృతి ఓఝా



రాజన్న ఆలయంలో జిల్లా ప్రత్యేక అధికారి శృతి ఓఝా 8లో

సీఎంఆర్ లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 7: వానాకాలం, యాసంగి సీజన్‌లు 2023-24కు సంబంధించిన సీఎంఆర్ లక్ష్యాన్ని సెప్టెంబర్ చివరి వరకు పూర్తి చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తోపాటు ఆ శాఖ అధికారులతో సీఎంఆర్ బియ్యం సరఫరాపై ఆ శాఖ కమిషనర్ చౌహాన్‌తోకలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ సీఎంఆర్ అందించే గడువు పెంచబోమన్నారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా మేనేజర్ జితేందర్‌ప్రసాద్, డీటీలు పాల్గొన్నారు.

వాక్ ఫర్ ఇన్నోవేషన్ ర్యాలీ



సిరిసిల్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 7: ఇంటింటా ఇన్నోవేషన్-2024లో భాగంగా అర్హులు ఈ నెల 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రమేష్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కుసుమరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి వాక్ ఫర్ ఇన్నోవేషన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన ఇన్నోవేషన్‌లను ఆగస్టు 15న ప్రదర్శించనున్నట్లు చెప్పారు. జిల్లా సైన్స్ అధికారి దేవయ్య, ఈడీఎం శ్రీనివాస్, జిల్లా కో ఆరినేటర్ అనిల్, ప్రధానోపాధ్యాయుడు లకావత్ మోతీలాల్‌పాల్గొన్నారు.

జిల్లా పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు సన్మానం



సన్మానిస్తున్న గోపాల మిత్రలు

సిరిసిల్ల టౌన్ ఆగస్టు 7:జిల్లా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవీందర్ రెడ్డిని బుధవారం జిల్లా మా గోపాలమిత్ర కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయననుసన్మానించారు. కమిటీ జిల్లా అధ్యక్షుడు కట్కూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 7 : ఎస్జీటీ ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి కోరారు. సిరిసిల్ల పట్టణంలోని పలు పాఠశాలల్లో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన సభ్యుత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, మైలారం తిరుపతి, మిట్టపల్లి లక్ష్మీనారాయణ, గుండెల్లి రవీందర్, రవిబాబు, కోడం రాంప్రసాద్‌లు పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమార్చన



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సిరిసిల్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలోని రాజ శ్యామల, వారాహి సహిత, లలిత త్రిపుర సుందరి, అష్ట లక్ష్మీ సహితలక్ష్మీ నారాయణ దేవాలయ వార్షికోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగం గా ఈ నెల 9 వరకు జరిగే కోటి 8 లక్షల కుంకుమార్చ కార్యక్రమంలో మహిళలు భక్తి శ్రద్ధలతో పాల్గొంటున్నారు. బుధవారం అమ్మవారిని వివిధ రకాల పండ్లతో అలం కరించారు. అయ్యప్ప దేవాలయం ట్రస్ట్ చైర్మన్ గురుస్వామి రాచ విద్యాసాగర్ ఆధ్వర్యంలో వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి.

అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలి : కలెక్టర్

వీర్నపల్లి, ఆగస్టు 7 : గ్రామ అభివృద్ధి పనులకు ప్రజలందరూ సహకరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న డబల్ రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులతో ఇరువైపులా ఉన్న ఇళ్లను తొలగిస్తే నష్టపోతున్నామని స్థానికులు కలెక్టర్‌కు విన్నవించారు. సమస్యను పరిష్కారం చేసేలా ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామన్నారు. అనంతరం మండల కేంద్రంలో పెద్దవాగు వంతెన పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కేజీబీవీ పాఠశాలకు రహదారి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడే ఉన్న యువకులు మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరగా కలెక్టర్ స్పందించి గ్రంథాలయానికి కావలసిన భవనాన్ని చూడాలన్నారు. గ్రంథాలయానికి కావలసిన పుస్తకాలను వెంటనే పంపిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండలం ఏర్పడి ఏళ్లు గడుస్తున్న ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయలేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతిరెడ్డి, సెస్ డైరెక్టర్ మల్లేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతి యాదవ్, మాజీ సర్పంచ్ దినకర్, ఎంపీటీసీ అరుణ్ కుమార్ ఉన్నారు.



సమస్యలపై స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్

కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంతో నేరాల నియంత్రణ



తనిఖీ చేస్తున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

చందుర్తి, ఆగస్టు 7: నేరాల నియంత్రణనే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తోందని వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. చందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవునితండాలో బుధవారం ఉదయం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్స్ లేని 31 ద్విచక్ర వాహనాలు, అక్రమ గుడుంబా తయారీకి కోసం నిల్వ ఉంచిన సామగ్రిని, అక్రమ కలప దుంగలను స్వాధీనం చేసుకున్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేశారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు రక్షణ, భద్రతా భావం కల్పించేందుకు కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్తులు షెల్టర్ తీసుకుంటే తెలుస్తుందన్నారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీఐ వెంకటేస్వర్లు, ఎస్సైలు శ్రీకాంత్, శేఖర్ రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు మొదటి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 7: మహిళల భద్రత తమ మొదటి ప్రాధాన్యమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని రగుడు సమీపంలో సాయి మణికంఠ కల్యాణమండపంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నపిల్లల రక్షణ కోసం పోలీస్‌శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా వ్యాప్తంగా షీటీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్నా పోలీసులను సంప్రదించాలన్నారు. నేరుగా సంప్రదించలేని వారు షీటీమ్ నెంబర్ 8712656425లేదా డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ, షీటీం ఏఎస్సైన ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక నిధులు కేటాయించేందుకు కృషి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 7 : రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల కోసం ప్రత్యేక నిధులను కేటాయించేందుకు కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ మండల కేంద్రంలోని మండల పరిషత్ ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాలు, సహాయ పరికరాలు ఎంపిక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు సహయ పరికారల పంపణీకి ఎంపిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా పరిధిలో శనివారం వరకు వివిధ వేదికల్లో శిబిరాలు కొనసాగుతాయన్నారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెలలో సిరిసిల్లలో 8వ తేదీన కంటి చూపు, 21న వినికిడికి, 23న ఆర్థో, 28న మానసిక దివ్యాంగులకు సంబంధించి సదరం క్యాంపులు ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం వేములవాడలో నిర్వహిస్తున్న క్యాంపులకు రానివారు చందుర్తి, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల పట్టాణాల్లో నిర్వహించే క్యాంపులకు వచ్చి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, తహసీల్దార్ మహేష్ తదితరులు ఉన్నారు.

ప్రపంచ మార్కెట్‌తో పోటీ పడాలి

- చేనేత, పవర్‌లూం రంగాలకు ప్రభుత్వం భరోసా
- నేత కార్మికులకు ప్రభుత్వ ఆర్డర్లు ఇస్తాం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - ఘనంగా చేనేత దినోత్సవం



నేతన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని పోటీ ప్రపంచంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ నిలదొక్కుకోవాలని, ప్రపంచ మార్కెట్‌తో నేతన్నలు పోటీ పడాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. సిరిసిల్లలోని బీ వైనగర్ చేనేత జౌళి శాఖ కార్యాలయం నుంచి చేనేత చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణితోపాటు వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. నేతన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం షాదీఖానాలో చేనేత వస్త్రాలు ధరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. నేత కార్మికులను సన్మానించారు. ప్రభుత్వం నుంచి 'నేత చేయూత' పథకంలో కార్మికులకు రావాల్సిన రూ.2.64 కోట్ల చెక్కును విడుదల చేశారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడు నెలలు సీజనల్‌కు సంబంధించిన ఇబ్బందులను అవగాహన చేసుకున్న తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో పాలనపై దృష్టి పెట్టలేకపోయామన్నారు. ఇప్పుడే సంక్షోభంపై దృష్టి పెట్టి ఆరు గ్యారంటీలు అమలు చేశామని, మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్య బీమా పెంపు వంటివి అమలు చేశామన్నారు. నేత కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు పోతోందన్నారు. గతంలో సిరిసిల్ల వస్త్ర సంక్షోభంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సిరిసిల్లకు వచ్చి ఆదుకున్నారన్నారు. సిరిసిల్ల వస్త్ర సంక్షోభంపై సమీక్షించి పవర్‌లూం పరిశ్రమకు భరోసా ఇచ్చినట్లు చెప్పారు. విద్యుత్ సమస్యపై సెస్ పాలకవర్గం, అధికారులతో చర్చించామన్నారు. సిరిసిల్లలో 37 మంది యువ పారిశ్రామికులు వస్త్రోత్పత్తి రంగంలోకి రావడానికి సిద్ధమయ్యారని, వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా నుంచి వచ్చిన తరువాత నేత కార్మికులు శుభవార్త వినబోతున్నారన్నారు. సిరిసిల్లకు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నట్లు చెప్పారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వ ఆర్డర్లతోపాటు వేములవాడ దేవస్థానంలో ఉపయోగించే కండువాల ఆర్డర్లు ఇవ్వడానికి నిర్ణయించామన్నారు. సిరిసిల్ల పరిశ్రమకు రావాల్సిన బకాయిలు కొంత మేరకు ఇప్పించామన్నారు. టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలన్నారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం రంగం తరువాత అత్యధికంగా ఉపాధి పొందుతున్న రంగం చేనేత రంగమని, కార్మికులను ఆదుకోవడానికి పరిశ్రమను ప్రోత్సహించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, ఏడీ సాగర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, పీసీసీ కో ఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నాగుల సత్యనారాయణ, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, చేనేత వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం నర్సయ్య, యారన్ అసోసియేషన్ అధ్యక్షుడు పిస్క మధు, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి రవి పాల్గొన్నారు.



ర్యాలీలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కార్మికులను సన్మానిస్తున్న ఆది శ్రీనివాస్

● మగ్గంపై నేసిన ఫొటో బహూకరణ

చేనేత దినోత్సవం సందర్భంగా సిరిసిల్లకు వచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఆయన చిత్రాన్ని మగ్గంపై నేయించి పీసీసీ కో ఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్ బహూకరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్‌ను, కేకే మహేందర్‌రెడ్డి, నాగుల సత్యనారాయణను సన్మానించారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 7: కరీంనగర్‌లో రెండు రోజుల కిందట వైన్‌షాపులో దొంగతనానికి పాల్పడిన కేసులో నిందితుడు మహారాష్ట్ర అమరావతి జిల్లా వరుడ్ ప్రాంతానికి చెందిన దుర్వ అజయ్(20)ను బుధవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ ఒకటో టాణా పోలీసులు తెలిపారు. నిందితుడు ఒక వైన్ షాపులో 35 వేల నగదును దొంగిలించాడని, తన అనుచరులతో కలిసి మరో వైన్ షాపులో చోరీకి ప్రయత్నించినట్లు తెలిపారు. నిందితుడిని ఉజ్వలపార్క్ సమీపంలో అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.20 వేల నగదు, సికింద్రాబాద్‌లో దొంగిలించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వీధి కుక్క దాడిలో చిన్నారికి గాయాలు


గాయపడిన చిన్నారి హరినందన్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 7: నగరంలో శాతవాహన యూనివర్సిటీ రోడ్డులోని ఆర్ఆర్ బాంక్విట్ హాల్ ముందు బుధవారం సాయంత్రం రెండేళ్ల వయసు కలిగిన చిన్నారిపై వీధి కుక్క ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. జీవనోపాధి కోసం తంగళ్ళపల్లి పద్మ, వినోద్ అనే దంపతులు కరీంనగర్‌కు వచ్చి కుటుంబంతో జీవిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు కాగా, చిన్న కుమారుడు తంగళ్ళపల్లి హరినందన్‌ను అమ్మమ్మ ఆడిస్తుండగా రోడ్డుపై నుంచి వెళ్తున్న వీధి కుక్క దాడి చేసింది.

దీంతో చిన్నారి ముఖం, చేతులపై గాయాలు కాగా కుక్కను అమ్మమ్మతో పాటు అక్కడున్న వారు కుక్కను వెళ్ల గొట్టే ప్రయత్నం చేస్తున్నా బాబును వదిలిపెట్టలేదు. చివరకు ఇటుకలు, రాళ్ళను కుక్కపైకి విసరడంతో చిన్నారిని వదిలిపెట్టి కుక్క వెళ్లింది. స్పృహ కోల్పోయిన చిన్నారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, తమ కళ్లముందే చిన్నారిపై కుక్క దాడి చేయడంతో తల్లిదండ్రులు, అమ్మమ్మ తీవ్రంగా విలపించారు. వీధి కుక్కల బెడదను నివారించి దాడికి గురైన చిన్నారికి మెరుగైన చికిత్స ను అందించి, వారి కుటుంబానికి ప్రభుత్వం సహాయం చేయాలని స్థానికులు కోరారు.

హమాలీలపై కుక్కల దాడి

కోల్‌సిటీటౌన్: గోదావరిఖని కొత్త కూరగాయల మార్కెట్‌లో బుధవారం ఇద్దరు హమాలీలపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో పరమేశ్వర్ అనే హమాలీకి వీపు, తొంటి భాగంలో తీవ్రంగా గాయాలు కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. అక్కడ ఉన్న మిగతా వారు కుక్కలను తరిమికొట్టారు. గాయాలైన పరమేశ్వర్‌ను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి చికిత్స నిమిత్తం పంపించారు.

శ్రీపాద ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/ధర్మారం/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం 6 గంటల వరకు 6,752 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరులోకి తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.75 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 12 టీఎంసీల నీరు మిడ్‌మానేరుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6300 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్థి స్థాయి సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 17.06 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 1.25 టీఎంసీల నీరు చేరింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మధ్యమానేరు నుంచి నీరు వస్తుండగా రెండు మోటర్ల ద్వారా ప్రతి రోజు 3400క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయకసాగర్‌కు 3,600 క్యూసెక్కుల నీరు వెళుతుందని డీఈ దేవేందర్ తెలిపారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌ను పూర్తిగా నింపిన తర్వాత మండలానికి ఉపయోగపడతాయనుకుంటే గతంలో మాదిరిగానే రంగనాయకసాగర్‌కు ఎక్కువ నీటిని విడుదల చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీఫార్మసీ పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 7: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూలై- 2024లో నిర్వహించిన బీఫార్మసీ ఏడవ, ఎనిమిదో సెమిస్టర్ పరీక్షల ఫలితాల ను బుధవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఈ ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.in.లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట, ఆగస్టు 7: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ఏడు ట్రాక్టర్లను వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం పోలీసులు పట్టుకున్నారు. కోరపల్లిలో 2, సాయి గార్డెన్ దగ్గర 1, ధర్మారం 4, మొత్తం ఏడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వేణు, మహేందర్, పరుశురాము, ప్రవీణ్ కుమార్, తిరు పతి, వి తిరుపతి, కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

సైబర్ వలలో ప్రభుత్వ ఉద్యోగి



సారంగాపూర్, ఆగస్టు 7: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ర్యాగల శివప్రసాద్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నాడు. పనిఒత్తిడిలో భాగంగా తన ఫోన్‌కు వచ్చిన మెస్సేజ్‌లను ఓపెన్ చేస్తున్న క్రమంలో తన వాట్సప్‌కు ఓ బ్యాంకుకు సంబంధించిన లోగోతో లింక్ వచ్చింది. బ్యాంకు సంబంధించినది అనుకుని ఓపెన్ చేయగా ఏటీఎం పిన్ఎంటర్ చేయమని అడగగా ఎంటర్ చేశాడు. దీంతో తన ఖాతా నుంచి రూ. 40 వేలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు మెసేజ్ వచ్చింది. మోసపోయానని గ్రహించిన శివప్రసాద్ బ్యాంకు స్టేట్‌మెంట్ తీసుకుని సైబర్‌క్రైం అధికారులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బ్యాంకుకు సంబంధించిన లోగోతో కూడిన మెసేజ్ రావడంతో ఓపెన్ చేసి మోసపోయినట్లు బాధితుడు శివప్రసాద్ పేర్కొన్నారు.

దుంపెట వాసి ఖాతా నుంచి రూ.1.13లక్షలు..

కథలాపూర్: మండలంలోని దుంపెటకు చెందిన ఓ వ్యక్తి సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోయాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం...దుంపెటకు చెందిన వ్యక్తికి వాట్సాప్‌లో ఏపీకే ఫైల్ మెసేజ్ రాగా దాన్ని క్లిక్ చేశాడు. దీంతో 20 దఫాలుగా ఖాతా నుంచి రూ. 1,13,804లు గుర్తు తెలియని వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. యూనియన్ బ్యాంక్ ఖాతాను అప్‌డేట్ చేసుకోవాలని పేర్కొంటూ వచ్చిన మెసేజ్‌కు స్పందించడం వల్ల సైబర్ నేరగాళ్లు డబ్బులు మాయం చేశారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించ వద్దని సూచించారు.


రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

బుగ్గారం ఆగస్టు7: మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో ఓ వృద్ధుడు రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరా ల మేరకు చిన్నాపూర్ గ్రామానికి చెందిన కలమడుగు వెంకయ్య (76) బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తన ఇంటి ముందు గల జాతీయ రహదారికి అవతలివైపునకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ధర్మపురి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం జరుగడంతో వెంకయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు కలమడుగు నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బుగ్గారం ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

గల్ఫ్ కార్మికుడికి ప్రభుత్వ విప్ అండ

సిరిసిల్లక్రైం, ఆగస్టు 7: సౌదీలో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న సిరిసిల్ల పట్టణంలోని సిద్దులవాడకు చెందిన మహ్మద్ ఇమ్రాన్ అనే 23ఏళ్ల యువకుడికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అండగా నిలిచారు. ఇమ్రాన్ స్వదేశా నికి వచ్చేందుకు అయ్యే విమాన టికెట్లు, ఇతర ఖర్చులను స్వయంగా భరిస్తానని బుధవారం తెలిపారు. ఇమ్రాన్‌ను త్వరలో స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బుధవారం సౌదీలో ఉన్న ఎన్ఆర్ఐ భైరి యాదవ్‌ను ఇమ్రాన్ వద్దకు పంపించి సురక్షితంగా ఇంటికి రప్పించేందుకు చర్యలు చేపట్టారు. ఇండియాకు వచ్చేందుకు అయ్యే ఖర్చులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ ఇమ్రాన్ వీడియో విడుదల చేశాడు.

జలపాతంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


హర్షిత్ (ఫైల్)

తిర్యాణి, ఆగస్టు 7: తిర్యాణి మండలంలోని గుండాల జలపాతంలో సోమవారం గల్లంతైన పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన రిషి హర్షిత్(18) మృతదేహం బుధవారం జలపాతం మడుగులో లభ్యమైంది. మిత్రులతో కలిసి సోమవారం జలపాతం చూడటానికి వచ్చిన రిషి సెల్ఫీ తీసుకునే క్రమంలో జలపాతంలో జారిపడి గల్లంతయ్యాడు. రెండు రోజులపాటు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి బుధవారం మృతదేహన్ని వెలికి తీశారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ సదయ్య, సీఐ చిట్టిబాబు, ఎస్సై రమేష్‌లు పరిశీలించి రిషి మృతదేహన్ని తిర్యాణి పీహెచ్‌సీకి తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సదయ్య మాట్లాడుతూ జలపాతాలకు వచ్చే సందర్శకులు జాగ్రత్తలు పాటించాలని, జాగ్రత్తలు తీసుకోకుండా ఈత రాని వారు నీటిలో దిగి సెల్ఫీలు దిగడం, రీల్స్ చేయడం వంటి వి చేపట్టకూడదన్నారు. మృతుడు సోదరుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

గంగాధర, ఆగస్టు 7: గంగాధర మండలం కురిక్యాలకు చెందిన అబ్బిడి అనిల్‌రెడ్డి(30) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కురిక్యాల గ్రామానికి చెందిన అనిల్‌రెడ్డి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్యంతో బాధపడుతూ మానసికంగా కుంగిపోయి మంగళవారం గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ తరలించగా మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డిపేట మండలంలోని వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి మత్తులో పడొద్దు

తాండ్ర్యాల యువకుడి రిమాండ్

మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

కథలాపూర్, ఆగస్టు 7: గంజాయి మత్తులో పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు సూచించారు. బుధవారం కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో తాండ్ర్యాలకు చెందిన కాసారపు వర్ధన్ అనే యువకుడు బుధవారం గంజాయి సరఫరా చేస్తుండగా ఎస్సై నవీన్ ఆధ్వర్యంలో పట్టుకోగా రిమాండ్ వివరాలను వివ రించారు. గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి పలు గ్రామాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నట్టు సమాచారం రావడంతో పోసాని పేట శివారులో 160 గ్రాముల గంజాయితో వర్ధన్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి సేవించడం, విక్రయించడం వంటివి చేసి యువత భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. నిందితుడిని పట్టుకునేందుకు కృషి చేసిన సీఐ సురేశ్ బాబు, ఎస్సై నవీన్, కానిస్టేబుల్ పురుషోత్తం, నవీన్‌ను అభినందించారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

యువకుడి ఇంటి ఎదుట బైఠాయించిన యువతి

చొప్పదండి, ఆగస్టు 7: పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని ఓ యువకుడి ఇంటి ఎదుట ఓ యువతి బైఠాయించింది. ఎస్ఐ అనూష కథనం మేరకు.. చొప్పదండికి చెందిన చిటిపాక విక్రమ్‌కు మల్యాల మండలం తాటిపెల్లికి చెందిన యువతితో రెండేళ్ల క్రితం వివాహం నిశ్చయమైంది. తాను దుబాయి వెళ్లి వచ్చిన తరువాత పెళ్లి చేసుకుంటానని చెప్పిన విక్రమ్ ఆ తరువాత మాట మార్చి వేరే అమ్మాయితో వివాహం కుదుర్చుకొన్నాడు. ఈ విషయం తెలుసుకున్న యువతి విక్రమ్ ఇంటి ఎదుట బైఠాయించింది. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే సహించం

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ


శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ

సుభాష్‌నగర్, ఆగస్టు 7: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సూర్యం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ప్రభుత్వం విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పోకడలు పోతోందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలను విస్మరించి బడ్జెట్‌ను ప్రవేశాపెట్టిందన్నారు. గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం విద్య రంగానికి ఒక్క శాతం నిధులు మాత్రమే పెంచిందన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు కేవలం విద్యారంగంలో పనిచేసే ప్రభుత్వ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది జీతభత్యాలకే సరిపోతాయన్నారు. నూతన గురుకులాలకు సొంత భవనాలు, స్థలాల కేటాయింపు ఇప్పటివరకు జరగలేదన్నారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల పరి స్థితి అస్తవ్యస్తంగా ఉందని వారు విమర్శించారు. యూనివ ర్సిటీల్లో కనీసం వైస్ చాన్సలర్లు, బోధన సిబ్బంది లేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు నేటికీ విడుదల చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు, మెస్, కాస్మోటిక్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలని కోరారు.

స్టూడెంట్ మెనేజ్‌మెంట్ హాస్టల్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్స్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులందరికీ ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం విద్యారంగంలో మతభావాలను వ్యాపింపచేస్తోందని వారు ఆరోపించారు. నిరుద్యోగ అంశాన్ని పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు అ న్యాయం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లైన్ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జిందం ప్రసాద్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్, జిల్లా నేతలు ముల్కల మారుతి, లోకిని రమేశ్, సన్నీ, రాజేశ్, గణేశ్, రవికుమార్, దేవేందర్, మధుసూదన్, సాయి, స్వప్న, వందన పాల్గొన్నారు.

ఆర్థిక వివాదాలతో జర్నలిస్టు ఆత్మహత్య

తన మృతికి బిల్డర్ భార్య, మరో వ్యక్తి కారణమంటూ ఎమ్మెల్యేకు లేఖ


మధునయ్య (ఫైల్)

కోల్‌సిటీ, ఆగస్టు 7: గోదావరిఖనికి చెందిన సీనియర్ జర్నలిస్టు, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి నాయిని మధునయ్య(62) ఆర్థిక వివాదాలతో బుధవారం తెల్లవారుజామున హనుమాన్‌నగర్‌లోని తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు కొచ్చెర్ల ప్రవీణ్ అనే బిల్డర్ భార్య లలిత, పెద్దపల్లి పోషయ్యలు కారణమని పేర్కొన్నారు. ఈ మేరకు రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ పేర తన సెల్‌లో మరణ వాంగ్మూలం లేఖ పెట్టాడు. పోలీసులు తెలిపిన వివరాలు...

గోదావరిఖనికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి నాయిని మధునయ్య (62) మల్కాపూర్ శివారులోని జర్నలిస్టు కాలనీలో ఒక ఇల్లు నిర్మించుకునేందుకు కొచ్చెర్ల ప్రవీణ్ అనే బిల్డర్‌తో రూ.40 లక్షలకు అగ్రిమెంట్ చేసుకున్నాడు. పలు దఫాలుగా ఒప్పందాన్ని మించి రూ.60 లక్షలు చెల్లించాడు. మధునయ్య ఇంటి పక్కన ఉన్న స్థలాన్ని విక్రయిస్తానంటూ ప్రవీణ్ మధునయ్య వద్ద మరో రూ.13లక్షలు తీసుకున్నాడు. కానీ ఆ భూమిని అప్పటికే ప్రవీణ్ పెద్దపల్లి పోషయ్య అనే వ్యక్తిపేర రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ విషయం మధునయ్యకు తెలియడంతో నిలదీయగా ఆ భూమిలో ఇల్లు నిర్మించి రిజిస్ట్రేషన్ చేయిస్తానని మాట ఇచ్చాడు. ఏడాది క్రితం బిల్డర్ ప్రవీణ్‌ను అతని భార్య లలిత హత్య చేయించింది. ఈ కేసులో లలిత జైలుకు వెళ్లి వచ్చిన తరువాత మధునయ్య ఇంటి నిర్మాణం గురించి, పక్కన ఉన్న స్థలం రిజిస్ట్రేషన్ గురించి పలు మార్లు సంప్రదించారు.

ఈ నెల 4న లలిత, పెద్దపల్లి పోషయ్యలు జర్నలిస్టు కాలనీలోని స్థలం వద్దకు రాగా మధునయ్య, మరో ఇద్దరు వ్యక్తులు వెళ్లి డబ్బుల గురించి అడిగారు. ఆ సమయంలో గొడవ జరిగి బూతులు తిట్టారని, అప్పటి నుంచి తన తండ్రి మానసికంగా కృంగిపోయి ఆత్మహత్య చేసుకున్న ట్టు మధునయ్య కొడుకు హరీష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా తన తండ్రి మృతికి కొచ్చెర్ల లలిత, పెద్దపల్లి పోషంలు కారణమని, వారిపై చర్యలు తీసుకోవాలని నాయిని హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కొచ్చెర్ల లలిత, పెద్దపల్లి పోషంలపై బీఎన్ఎస్ 108 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

వానాకాలం సాగుకు శ్రీరాంసాగర్ నీరు విడుదల


ఎస్సారెస్పీ నీటిని విడదుల చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జగిత్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగు అవసరాల కోసం శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నీటిని బుధవారం అధికారు లు, ప్రజా ప్రతినిధులు విడుదల చేశారు. పోచంపాడ్ ఎస్సారెస్పీ ప్రాజెక్టు వద్ద కాకతీయ కాలువ ద్వారా సాగునీటి సరాఫరాను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. అదే విధంగా సరస్వతీ కాలువకు నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి నీటి విడుదల ప్రారంభిం చారు. వానా కాలం సాగు సీజన్‌కుగాను ఎస్సారెస్పీ నీటిని రైతు లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా వారాబందీ పద్ధతి లో సాగు నీటి సరాఫరా కొనసాగించనున్నట్లు అధికారులు ప్రకటిం చారు. కాకతీయ కాలువకు 1,000 క్యూసెక్కుల నీటిని, సరస్వతీ కాలువకు 100 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌రావు, ఈఈ చక్రపాణి, పోచంపాడ్ ఎంహెచ్ఎస్ అండ్ సోలార్ సీఈ రమేశ్‌బాబు, డీఈ జె శ్రీనివాస్, డీఈఈలు,ఏఈఈలు, టీఎస్ జెన్‌కో అధికారులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలు, విష్ణుపురి, అంబూరా, బాలేగావ్ ప్రాజెక్టులు నిండుగా ఉండడం కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. బుధవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగు తోం ది. ఎస్సారెస్పీలోకి 11,055 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 46.952 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమ యానికి ప్రాజెక్టులో 76.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరము లకు కలిపి ప్రాజెక్టు నుంచి 1,983 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 42.145 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

గణేశ్‌నగర్, ఆగస్టు 7: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని టీజీ ఎన్పీ డీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో గల విద్యుత్ శాఖలోని ఎం ఆర్టీ, డివిజన్‌లో గల ఎల్‌టి మీటర్స్ ల్యాబ్‌లో సెమీ ఆటోమేటిక్ టెస్ట్ బెంచ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరిక రంతో అత్యంత కచ్చితత్వంతో అన్ని రకాల మీటర్లను పరీక్ష చేయవచ్చని తెలిపారు. వివిధ రకాల పరీక్షలు ఒకేసారి 20 మీటర్లుకు చేయవచ్చన్నారు. అనంతరం డివిజన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఈ ఆపరేషన్ కరీంనగర్ వి.గంగాధర్, డీఈ టెక్నికల్, కరీంనగర్ విజేందర్‌రెడ్డి, కె.కాళిదాసు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న వరుణ్‌రెడ్డి

కొండగట్టులో సహస్రనామ కుంకుమార్చన

మల్యాల, ఆగస్టు 7: కొండగట్టు శ్రీ అంజనేయ స్వామి సన్నిధిలో జరుగుతున్న శ్రావణ సప్తాహ ఉత్సవాలలో భాగంగా బుధవారం ఆండాళ్ తిరు నక్షత్రం పురస్కరించుకొని ఆండాళ్ అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఆంజనేయస్వామికి 108 కమలాలతో అర్చన, వెంకటేశ్వరస్వామికి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజలలో ఆలయ స్థానాచార్యులు కపీంధర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేంద్ర ప్రసాద్ అర్చకులు, వేదపండితులు,విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 7: సిరిసిల్ల పట్టణంలోని మానేరు బ్రిడ్జి కింద బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఈ మృతదేహం కుల్లిపోవడంతో నాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతి చెందని వ్యక్తి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, నీలిరంగు షర్టు, నీలిరంగు పాయింట్ ధరించి ఉన్నాడని తెలిపారు. గుర్తించిన వారు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ 98666 20105 నంబరులో సమాచారం అందించాలని తెలిపారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానించిన ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 7: రాజన్న ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు బదిలీపై వెళ్తుండడంతో ఈవో వినోద్‌రెడ్డి బుధవారం సన్మానించారు. బదిలీపై వెళ్తున్న ఇద్దరు ఏఈవోలను, ఏడుగురు పర్యవేక్షకులు, ఎనిమిది మంది సీనియర్ అసిస్టెంట్‌లను, 10 మంది జూనియర్ అసిస్టెంట్‌లతోపాటు డీఈలు బుధవారం రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

సీఏవోగా పదోన్నతి పొందిన రమణారావు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 7: జిల్లా కోర్టులో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న యు.వెంకటరమణారావుకు ముఖ్య పరిపాలనాధికారి(సీఏవో)గా పదోన్నతి కల్పిస్తూ హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన జిల్లా కోర్టు ముఖ్య పరిపాలనాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రమణారావును జిల్లా కోర్టు, ఏడీఎం, పీడీఎం, సబ్ కోర్టు అధికారులు సన్మానించారు.

కోనరావుపేట డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రవీణ్ కుమార్

కోనరావుపేట, ఆగస్టు 7: కోనరావుపేట మండల డిప్యూటీ తహసీల్దార్‌గా ఎల్సాని ప్రవీణ్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. కోనరావుపేటలో పనిచేసిన డీటీ జయంతి తంగళ్లపల్లికి బదిలీ కాగా కలెక్టర్ ఆఫీసులో పనిచేసిన ప్రవీణ్‌ను కోనరావుపేటకు బదిలీపై వచ్చారు.

పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారించాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 7: మహిళలు పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారించాలని పశు వైద్యాధికారి రేణుక అన్నారు. మండల కేంద్రంలోని కావేరి మహిళా సంఘ భవనం కార్యాలయంలో సెర్ప్, పశు సంవర్ధక శాఖ సంయుక్తంగా 'ఇందిరా మహిళా శక్తి' పథకంలో భాగంగా పెరటి కోళ్ల పెంపకంపై బుధవారం అవగాహన కల్పించారు. కోళ్ల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. అనంతరం హరిదాస్‌నగర్‌లోని కోళ్ల పెంపకం షెడ్డును డీపీఎం పద్మయ్య సందర్శించారు. జిల్లా ఏపీఎం రాజేశం, మండల ఏపీఎం మల్లేశం, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌ల నియామకాలు చేపట్టాలి



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న జిల్లా ల్యాబ్ టెక్నీషియన్లు

కోనరావుపేట ఆగస్టు 7: జిల్లా వైద్యశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌ల నియామకాన్ని చేపట్టాలని తెలంగాణ ల్యాబ్ టెక్నీషియన్ జిల్లా అధ్యక్షు జనార్దన్ కోరారు. జిల్లా వైద్య కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ లక్ష్మీనారాయణను బుధవారం కలిశారు. స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నియామకం చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అంతకుముందు ఆయనను న్మానించారు. డాక్టర్లు సుప్రియ, అరుణ ల్యాబ్ టెక్నీషియన్లు సత్యనారాయణ, మహేందర్ తదితరులు ఉన్నారు.

పెద్దలింగాపూర్ గ్రామస్థులను అడ్డుకున్న పోలీసులు

తంగళ్లపల్లి, ఆగస్టు 7: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మానేర వంతెన సమీపంలో ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ తాజా మాజీ సర్పంచ్‌ను పోలీసులు ఆదుపులోకి తీసుకొని సిరిసిల్ల రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో మద్దతుగా గ్రామస్థులు సిరిసిల్లకు వస్తుండడంతో తంగళ్లపల్లిలో భారీగా పోలీసులను మోహరించి అడ్డుకున్నారు. తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గంట తర్వాత వదిలి పెట్టినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ వాహనాల తనిఖీ చేపట్టామని, ఎవరినీ ఆదుపులోకి తీసుకోలేదని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తంగళ్లపల్లి, ఆగస్టు 7: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సుధాకర్ సూచించారు. బుధవారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లిలో బాలికల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో సైబర్ జాగృతి దివస్‌లో భాగంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే ట్రోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేయాలన్నారు. ప్రిన్సిపాల్ పద్మ పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని కేరళ హై స్కూల్‌లోని విద్యార్థులకు సైబర్ జాగరుకత దివాస్ పేరిట ఎస్సై అశోక్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ బాబు నంబీయార్ ఉన్నారు.

గుండారం గ్రామాన్ని సందర్శించిన బౌద్ధ మత ప్రచారకులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 7:ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామాన్ని సింగపూర్‌కు చెందిన బౌద్ధ మత ప్రచారకులు బుధవారం సందర్శించారు. గ్రామంలోని గిరిజనుల ఆచార వ్యవహారాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులను గౌతమ బుద్ధుడి ప్రతిమను పంపిణీ చేశారు. జగదాంబ, అంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని తాజా, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్ ఇటీవల గుండెపోటుతో చికిత్స పొంది కోలుకున్నారు. అతడి కుమారుడు గణేశ్ హైదరాబాద్‌లోని మిత్రుడి ద్వారా సింగపూర్‌లోని బౌద్ధ మత ప్రచారకులను గుండారం గ్రామానికి ఆహ్వానించారు.

పాలకవర్గం రాజీనామా చేయాలి

చందుర్తి ఆగస్టు 7: చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌తోపాటు పాలకవర్గ సభ్యులు వెంటనే రాజీనామా చేయాలని మాజీ ఎంపీపీ చిలక పెంటయ్య ప్రకటనలో డిమాండ్ చేశారు. సంఘంలో రైతులకు సహకారం అందించడంలో పాలకవర్గం విఫలమైందని తెలిపారు. అవినీతి అక్రమాలకు నిలయంగా మారిందని ఆరోపించారు.

ఎస్సీ హాస్టల్ తనిఖీ

కోనరావుపేట, ఆగస్టు 7: కోనరావుపేట మండలం ధర్మారం ఎస్సీ హాస్టల్‌ను మండల ప్రత్యేక అధికారి ఆర్డీవో రాజేశ్వర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్‌కు సూచించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ ఉన్నారు.

స్వచ్ఛదనం.. పచ్చదనంలో

ప్రజలను భాగస్వాములను చేయాలి

● జిల్లా ప్రత్యేక అధికారి శృతి ఓఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 7: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి శృతి ఓఝా అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం కార్యక్రమం అమలుపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, మండల ప్రత్యేక అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. కార్యక్రమాన్ని అమలు చేయడంలో ప్రత్యేక అధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు. స్వచ్ఛదనంతో ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని, పచ్చదనంతో కాలుష్యం తగ్గుతుందని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రోడ్లపై గుంతలు పూడ్చే ప్రక్రియను ప్రణాళిక బద్ధంగా చేపట్టాలన్నారు. సమావేశంలో వేములవాడ సిరిసిల్ల ఆర్డీవోలు రాజేశ్వర్, రమేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని స్వచ్ఛదనం పచ్చదనం జిల్లా ప్రత్యేకాధికారి, ఇంటర్ మీడియెట్ బోర్డు డైరెక్టర్ శృతి ఓఝా ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి బుధవారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల, నేరెళ్ల గ్రామాల్లో పర్యటించారు.



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి శృతి ఓఝా

అనంతరం గ్రామంలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేష్, డీఆర్డీవో శేషాద్రి, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో మీర్జా అఫ్జల్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: స్వచ్ఛదనం- పచ్చదనంలో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియన్ కళాశాలలో బుధవారం కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి కళాశాల ప్రాంగణంలో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మిర్జా ఫసహత్ బేగ్ అలీ, కళాశాల ప్రిన్సిపాల్ విజయరాఘవరెడ్డి, డీఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ కల్చరల్: వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను స్వచ్ఛదనం, పచ్చదనం జిల్లా ప్రత్యేకాధికారి, ఇంటర్మీడియెట్ బోర్డు సెక్రెటరీ శృతి ఓఝా బుధవారం పరిశీలించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి కళాశాలలోని తరగతి గదులను పరిశీలించారు. తరగతి గదుల్లోని విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్ వివరాలు అడిగారు. కళాశాలలో కావాల్సిన వసతులపై ప్రిన్సిపాల్ శరత్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని జిల్లా ప్రత్యేకాధికారి శృతి ఓఝా, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఈవో రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. తహసీల్దార్ మహేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రూ.80వేల కోట్ల నష్టాల్లో విద్యుత్ రంగం



ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 7: రాష్ట్ర విద్యుత్ రంగం రూ.80 వేల కోట్ల పై చిలుకు నష్టాల్లో ఉందని, అయినా వినియోగదారులకు, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని 4వ వార్డులో పురాతనమైన ప్రమాదకర 34 విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో బుధవారం నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు, గృహజ్యోతి కింద రూ.200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. సెస్ ఇబ్బందులను అధిగమించడానికి పాలకవర్గంతో మాట్లాడినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని మెరుగైన కార్యక్రమాలతో ముందుకెళ్తామన్నారు. రుద్రవరం పరిధిలో ఇటీవల నూతనంగా సబ్ స్టేషన్ మంజూరైందన్నారు. పెరిగిపోతున్న గృహ అవసరాలకు అనుగుణంగా నింతరం విద్యుత్ సరఫరా చేయనున్నట్లు చెప్పారు. లో ఓల్టేజీ సమస్య, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్న చోట సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కౌన్సిలర్ మారం కుమార్, నిమ్మశెట్టి విజయ్, రామచంద్రం నాయకులు వెంకటస్వామి, తూమ్ మధు, సత్యలక్ష్మి, రమేష్ ఉన్నారు.

చేనేతకు ప్రభుత్వం చేయూతనివ్వాలి



చేనేత కార్మికులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 7 : చేనేత రంగంతోపాటు వస్త్ర పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనివ్వాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని గణేష్‌నగర్‌లోని జగదాంబ చేనేత సహకార సంఘంలో బీజేపీ చేనేత సెల్ కన్వీనర్ తవుటు రాజలింగం ఆధ్వర్యంలో బుధవారం చేనేత కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమలు సంక్షోభంతో మూతపడ్డాయన్నారు. స్పందించి నేతన్నలకు ఉపాధిని కల్పించాలని కోరారు. పట్టణ ఉపాధ్యక్షుడు మ్యాన రాంప్రసాద్, గాజుల సదానందం, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెల్లివేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : మండల కేంద్రంలో మార్కేండేయ దేవాలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో, పద్మనగర్‌లో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికులను సన్మానించారు. తంగళ్లపల్లి, పద్మనగర్ పద్మశాలీ సంఘాల అధ్యక్షులు రాపెల్లి ఆనందం, మోర శ్రీకాంత్, నాయకులు మోర శ్రీహరి, అంకారపు రవీందర్, మచ్చ ఆంజనేయులు, కోడం రమేశ్, సామాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఎస్సై గణేష్, ప్రధానోపాధ్యాయుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

వీర్నపల్లి ఆగస్టు 7 :: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్సై ఎల్లాగౌడ్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో మండల క్రికెటర్ అసోసియేషన్ తరపున ఏర్పాటు చేసిన పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులను అంద జేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల్లో గెలు పోటములు సహజమన్నారు. బహుమతులను వన్‌పల్లి మాజీ ఎంపీటీసీ బానోత్ పద్మ సేవ్యా నాయక్ స్పాన్సర్ చేశారు. మాజీ ఎంపీటీసీ మల్లారపు అరుణ్ కుమార్, టీఎస్ టీటీ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హాజు నాయక్, సేవాలాల్ సోషల్ సర్వీస్ ప్రధాన కార్యదర్శి రవిలాల్, గోరు సేన జిల్లా అధ్యక్షుడు రాజు నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఎల్లారెడ్డిపేట: బదిలీపై వెళ్తున్న ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను బుధవారం సన్మానించారు.

● ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని లక్ష్మీమల్లారెడ్డి కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో 9న దివ్యాంగుల ఉపకరణాల పంపిణీ కోసం లబ్ధిదారుల ఎంపిక శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్తయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

● ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుడు ఏర్పుల దేవయ్య వైద్య ఖర్చుల నిమిత్తం చిన్ననాటి స్నేహితులు రూ.30,001 బుధవారం అందజేశారు.

● ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదనం వ్యవస్థాపకులు గోవిందరాజుల మూడో ఆద్మీక ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

● ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా అండాళ్ తిరునక్షత్ర మహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు.

● ఒకేషనల్ ఎడ్యుకేషన్ కోర్సు మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్‌లో భాగంగా వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని ఫొటో స్టూడియోను బుధవారం సందర్శించారు.

వీర్నపల్లి : దేశంలో హరిత విప్లవానికి బాటలు వేసి ఆకలి లేని సమాజం కోసం కృషి చేసిన వ్యక్తి ఎమ్ఎస్ స్వామినాథన్ అని ప్రధానోపాధ్యాయుడు వెంగళ శ్రీనివాస్ అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వామినాథన్ 99వ జయంతిని బుధవారం నిర్వహించారు.

చందుర్తి: చందుర్తి మండలం రామన్నపేట ప్రాథమికొన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో ప్రదీప్, మాజీ సర్పంచ్ దుమ్ము అంజయ్య, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్,రాజు, బాబు పాల్గొన్నారు.

●చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన గజవాడ అంజలి, సంకోజి లక్ష్మీ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ ఉన్నారు.

వేములవాడ టౌన్: మంద కృష్ణ మాదిగ కృషితో ఎస్సీ వర్గీకరణ సాధించిన సందర్భంగా గురువారం నిర్వహించబోయే బైక్ ర్యాలీని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు విజయవంతం చేయాలని ఎంఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండా థామస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సినారే కళామందిర్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 11 గంటలకు తిప్పాపూర్ అంబేద్కర్ చౌక్ నుంచి కోరుట్ల బస్టాండు వరకు బైక్ ర్యాలీ ఉంటుందని తెలిపారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి



చేనేత మగ్గాలను పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 7: చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని రాజీవ్ నగర్‌లో మహేశ్వరీ చేనేత సహకార సంఘంలో బుధవారం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత వస్త్రాలను తయారు చేయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారన్నారు. అంతకు ముందు ప్రభుత్వ విప్ చేనేత మగ్గం నేశారు. కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, చేనేత సెల్ అధ్యక్షుడు గోనే ఎల్లప్ప, సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న అధికారులు

ఇల్లంతకుంట, ఆగస్టు 7: తల్లిపాలల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని వైద్యాధికారి కట్ట రమేష్ అన్నారు. మండలంలోని గాలిపెల్లిలో బుధవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలన్నారు. గర్భిణులు ప్రతీ నెల ఆసుపత్రికి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామైక్య సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంని ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్ అన్నారు. మండలంలోని బండపల్లిలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆధికారులు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు, ప్రధానోపాధ్యాయులు ఆనందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

కోనరావుపేట: తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనకమ్మ అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాలలో చివరి రోజున నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో బుధవారం మాట్లాడారు. పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు నర్సమ్మ, మరియ, గౌరీశ్వరి పాల్గొన్నారు.

రుణాల కోసం రైతుల నిరీక్షణ

- సోషల్ మీడియాల్ ఫొటో వైరల్



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న రైతుల ఫొటో

ఇల్లంతకుంట, ఆగస్టు 7: మండలకేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట రాత్రిపూట రైతులు కూర్చున్న ఫొటో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ప్రభుత్వం పంట రుణమాఫీ చేయగా తిరిగి రుణాలు ఇస్తోంది. ఎక్కువ మంది రైతులు బ్యాంకులకు ఒకేసారి వస్తుండడంతో రద్దీ నెలకొంటోంది. మొదట వచ్చిన వారికే ఆరోజుకు రుణాలు అందుతుండటంతో కొంతమంది రైతులు మంగళవారం రాత్రి బ్యాంకు ఎదుట కూర్చున్నారని ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. దీనిని తమకు అనుకూలంగా మార్చుకున్న ప్రతిపక్ష పార్టీ 'మార్పు కోరుకున్నది ఇందుకోసమే' అంటూ కామెంట్‌లతో పోస్టులు పెడుతోంది. దీనిపై టీజీబీ మేనేజర్ రమేష్‌ను వివరణ కోరగా బ్యాంకు ఎదుట రాత్రివేళ రైతులు ఉన్నది తెలియదని, ఉదయం వచ్చే సరికి రైతులు ఉంటున్నారని తెలిపారు.

దళితుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట, ఆగస్టు 7: దళితుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని బీజేపీ దళితమోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి మామిడి హరీష్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం మండల అధ్యక్షుడు కట్కూరి తిరుపతి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు దళితులకు ఇచ్చిన హామీ ఏఒక్కటి పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల కన్వీనర్ దెశెట్టి శ్రీనివాస్, దళిత మోర్చా అధ్యక్షుడు కట్కూరి తిరుపతి, అసెంబ్లీ కోకన్వీనర్ స్వామి, నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంటి మహేష్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులతో కలిసి బుధవారం నిరసన తెలిపి వినతి పత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు అంజగౌడ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు మీసాస్వామి పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఎస్సీ డిక్లరేషన్‌ని అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. వేములవాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. కార్యక్రమంలో సంతోష్‌బాబు, వివేక్‌రెడ్డి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఏడాదిన్నర జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 7:దొంగతనం కేసులో ఒకరికి ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు రూ.200 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్గిల్ చెరువు సమీపంలో కట్ట మైసమ్మ గుడిలో చోరీ కేసులో సిరిసిల్ల పట్టణంలోని విద్యా నగర్‌కు చెందిన కోడం లక్ష్మణ్‌ను రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నేరస్తుడు కోడం లక్ష్మణ్‌కు శిక్ష విధించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

వేములవాడ టౌన్, ఆగస్టు 7 : ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తూ వారి సంక్షేమం కోసం నిరంతరం పీఆర్టీయూ కృషిచేస్తోందని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్ అన్నారు. వేములవాడ పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్‌లో, శాత్రాజపల్లి, వట్టెంల, ఫాజుల్‌నగర్, చెక్కపల్లి, అచ్చన్నపల్లి, మర్రిపల్లి కేజీబీవీలలో మెంబర్‌షిప్ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. 1971 సంవత్సరం నుంచి ఉపాధ్యాయుల సమస్యలపై సంఘం పోరాటం చేస్తున్నట్లు చెప్పారు.

న్యాయవాదుల మానవహారం



సిరిసిల్లలో మానవహారం చేపట్టిన న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 7: సివిల్ కేసులలో కోర్టు ఆర్డర్‌లపై పోలీసుల వైఖరిని నిరసిస్తూ సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మానవహారం నిర్వహించారు. ముందుగా జిల్లా కోర్టులో విధులను బహిష్కరించి ర్యాలీ తీశారు. జనగామలో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడిపై నిరసన వ్యక్తం చేశారు. సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డోర్నాల సంజీవరెడ్డి మాట్లాడుతూ సివిల్ కేసులలో కోర్టు ఆర్డర్‌లను పక్కన పెడుతూ జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో చట్టాలను, కోర్టులను అపహస్యం చేస్తున్నారన్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై రాష్ట్ర బార్ అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లేందుకు నేడు చలో హైదరాబాద్ చేపట్టినట్లు చెప్పారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటి, ఉపాధ్యక్షుడు దుర్గారెడ్డి, ట్రెజరర్ విష్ణు, జాయింట్ సెక్రెటరీ నాగరాజు, కల్చరల్ సెక్రెటరీ కిషన్, గ్రంథాలయం కార్యదర్శి శశాంకం పాల్గొన్నారు.

● జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల బార్ అసోసియేషన్‌లో సీనియర్ న్యాయవాదులు కోడం సురేశ్, రవీందర్, జనార్దన్‌రెడ్డి, ధర్మేందర్, జగ్గారావు, రవీందర్‌రావు, వెంకటరెడ్డి, గోవిందు భాస్కర్, పీపీ పెంట శ్రీనివాస్, ఏపీపీ శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డోర్నాల సంజీవరెడ్డి, గుడిసె సదానందంను సన్మానించారు.

వేములవాడ టౌన్: విధి నిర్వహణలో న్యాయవాదులపై పోలీసులు దాడులు చేసి, అక్రమ కేసులు పెట్టం దారుణమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం అన్నారు. సిరిసిల్లలో న్యాయవాదిపై, జనగామలో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడికి కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. చట్టాలను అమలు చేయాల్సిన పోలీసులే న్యాయవాదులపై దాడులు చేసి అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవదూత రజనీకాంత్, ఉపాధ్యక్షుడు ప్రతాప సంతోష్, సీనియర్ న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం



తంగళ్లపల్లిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



గంభీరావుపేటలో మాట్లాడుతున్న హమీద్

తంగళ్లపల్లి ఆగస్టు 7: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్లం ప్రవీణ్ మండిపడ్డారు. బుధవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాజకీయ భవిష్యత్ ఇచ్చిన కేకే మహేందర్‌రెడ్డిపై అవాకులు చేవాకులు పేలితే ఊరుకోబోమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని అక్రమాలు చేశావో జిల్లా ప్రజలకు తెలుసన్నారు. నాయకులు సత్తు శ్రీనివాస్‌రెడ్డి, లింగాల భూపతి, నేరెళ్ల నర్సింగం, భైరినేని రాము, గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఓడినా ప్రజలకు అందుబాటులో ఉండి ఉన్నదంతా అమ్ముకుంటూ ప్రజలకు సేవ చేస్తున్నారని, మీలా అక్రమాలకు పాల్పడలేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యపై బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మండిపడ్డారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం మాట్లాడుతూ ఆగయ్య చేసిన అవినీతి, అక్రమాలను ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కేకే మహేందర్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఆగయ్యకు లేదన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, లింగాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజునాయక్, రాజయ్య, శ్రీనివాస్, బాబు తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట: కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకోబోమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ అన్నారు. గంభీరావుపేట మండలంలోని పార్టీ కార్యాలయంలో బుదవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కేకే మహేందర్‌రెడ్డిపై చేసిన ఆరోపణలపై మండిపడ్డారు. సిరిసిల్ల నియోజక వర్గంలో ప్రజాదరణ ఉన్న కేకే మహేందర్ రెడ్డిని విమర్శించే ముందు గతంలో తోట ఆగయ్య స్థాయి ఏంటో తెలుసుకోవాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో నియోజక వర్గ అభివృద్ధిపై తోట ఆగయ్య చర్చకు రావాలని డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ పర్శరాములు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగిస్వామి, నాయకులు ఉన్నారు.

ముస్తాబాద్: బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయి మతిభ్రమించి విమర్శలు చేస్తే సహించబోమని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు మండిపడ్డారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి బుధవారం మాట్లాడారు. ప్రజల కోసం పోరాడే కేకే మహేందర్ రెడ్డిపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య వాఖ్యలు సరికాదన్నారు. అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.